ఆ ఫోన్ కాల్ నా జ్ఞాపకాల్లో ప్రత్యేకం..



అందం, అమాయకత్వం కలిసిన ఈ కుందనపు బొమ్మ ఒకప్పుడు టాలీవుడ్ ని షేక్ చేసి.. ఇప్పుడు కోలీవుడ్ లో తన సత్తా చాటాడానికి సిద్ధమయ్యింది. వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో అమ్మడు అవకాశాలు పట్టేసింది. రజనీకాంత్ ధర్మన్, ధనుష్ ఓమ్, అజిత్ కుమార్ డేర్ డెవిల్ లో శ్రీలీలనే హీరోయిన్ గా నటిస్తుంది. అంతేకాకుండా బాలీవుడ్ లో కూడా ఒక సినిమా చేస్తుంది. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన తొలినాళ్లలోనే తనకు వచ్చిన ఓ ప్రత్యేకమైన ఫోన్ కాల్‌ను నటి శ్రీలీల తాజాగా గుర్తుచేసుకున్నారు. శ్రీలీల నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఓమ్'. కోలీవుడ్ స్టార్ ధనుష్ హీరోగా, దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కించిన ఈ చిత్రం రిలీజ్‌కు సిద్ధం అవుతున్న క్రమంలో వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు చిత్ర బృందం. ఈ సందర్భంగా తాజా ఇంటర్వ్యూలో శ్రీలీల ధనుష్ గురించి మాట్లాడుతూ.. 'నేను తెలుగు చిత్ర పరిశ్రమలో కి అడుగుపెట్టిన తొలినాళ్లలో ఓ ప్రముఖ నటుడు, దర్శకుడి నుంచి వచ్చిన తొలి పెద్ద ఫోన్ కాల్ ధనుష్‌దే. ఆయనతో కలిసి పనిచేసే అవకాశం రావడం నాకు ఎంతో ప్రత్యేకం. ధనుష్‌కు నేను పెద్ద అభిమానిని. భారతీయ సినిమాలో గొప్ప గుర్తింపు తెచ్చుకున్న ఆయనతో పనిచేయడం ఆనందంగా ఉంది' అని తెలిపింది. అలాగే కెరీర్ ప్రారంభంలోనే తనకు వచ్చిన తొలి పెద్ద అవకాశాన్ని గుర్తుచేసుకుంటూ, ఇప్పుడు ఆయనతో ఒకే సినిమాలో భాగం కావడం పట్ల సంతోషంగా ఉందంటూ శ్రీలీల చెప్పుకొచ్చింది. ఇక ధనుష్ వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ.. 'ధనుష్ నడుచుకుంటూ వస్తుంటే ఆయన దగ్గర నుంచి విభూతి వాసన వస్తుంది. అది నాకు ఒక ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది' అని తెలిపింది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత రోజురోజుకూ విస్తరిస్తున్న కొద్దీ దాని దుర్వినియోగం కూడా సినీ రంగాన్ని తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యంగా హీరోయిన్లను లక్ష్యంగా చేసుకుని అశ్లీల ఏఐ డీప్‌ఫేక్ వీడియోలు సృష్టించడం ఇటీవల ఎక్కువైంది. తాజాగా సౌత్ స్టార్ హీరోయిన్ శ్రీలీల కూడా ఈ సైబర్ నేరగాళ్ల బారిన పడ్డారు. గత రెండు రోజులుగా శ్రీలీల పేరిట ఒక అశ్లీల దుస్తుల్లో ఉన్న యువతి వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా షేర్ అవుతోంది. ఆ వీడియోలో ఉన్నది శ్రీలీల అని భావించి పలువురు నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకున్నారు. అయితే ఈ వైరల్ క్లిప్ వెనుక ఉన్న నిజానిజాలను పరిశీలిస్తే షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

కనిపించే గ్లామర్ వెనుక ఎన్నో కష్టాలు..



తన గ్లామర్ షోతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్న బాలీవుడ్ బ్యూటీ రవీనా టండన్.. తెరపై కనిపించే గ్లామర్ వెనుక ఎన్నో కష్టాలు ఉంటాయని రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. తాను, అక్షయ్ కుమార్ కాంబినేషన్‌లో వచ్చిన 'టిప్ టిప్ బర్సా పానీ' సాంగ్ తెరపై ఎంతో అందంగా, రొమాంటిక్‌గా కనిపించినప్పటికీ.. చిత్రీకరణ సమయంలో మాత్రం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు 'కోన్ హోనార్ కరోడ్‌పతి' క్విజ్ షోలో పాల్గొన్న సందర్భంగా రవీనా గుర్తుచేసుకుంది. '1994లో విడుదలైన 'మోహ్రా' సినిమాలోని ఈ పాట షూటింగ్ మూడు రోజుల పాటు జరిగింది. ఆ మూడు రోజులూ ప్రతిరోజూ దాదాపు 12 గంటల పాటు కృత్రిమ వర్షంలో తడుస్తూనే షూటింగ్ చేయాల్సి వచ్చింది. అప్పట్లో వర్షం కోసం ఉపయోగించే నీటిని ట్యాంకర్లలో రోజుల తరబడి నిల్వ ఉంచేవారు. అలా నిల్వ చేసిన నీరు షూటింగ్ సమయానికి విపరీతంగా చల్లగా మారేవి. ఆ నీటిలో తడుస్తూ డ్యాన్స్ చేయడం చాలా కష్టంగా ఉండేది. తెరపై పాటలో కనిపించే గ్లామర్ వెనుక ఇలాంటి ఎన్నో కష్టాలు ఉంటాయి. షాట్ పూర్తయ్యాక తడిసిన దుస్తులతోనే టవల్ కప్పుకుని కూర్చుని వణికిపోయేవాళ్లం. అంతే కాకుండా.. అప్పట్లో నాకు పని ఒత్తిడి కూడా చాలా ఎక్కువగా ఉండేది. ఒక ఏడాదిలో దాదాపు 30 సినిమాల్లో నటించిన సందర్భాలు ఉన్నాయి. ఒక సెట్‌లో షూటింగ్ పూర్తికాగానే మరో సెట్‌కు వెళ్లి పనిచేసేవాళ్లం' అని తెలిపింది రవీనా.

ధనుష్ పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుంది



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న భారీ పాన్‌ఇండియా యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ 'ఓం: చాప్టర్ 1 - ఉధిరం: ది బ్లడ్ వుడ్'. టాలెంటెడ్ డైరెక్టర్ రాజ్ కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం, నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న దర్శకుడు రాజ్ కుమార్ పెరియసామి ధనుష్‌తో పనిచేసిన అనుభవాలను, సినిమా విశేషాలను పంచుకున్నారు. ధనుష్‌కి ఈ చిత్రం కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన, ఆసక్తికరమైన పాత్ర అని తెలిపారు. ఆయన గతంలో కొన్ని సినిమాల్లో స్మగ్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో నటించినప్పటికీ, ఈ పాత్రలో సరికొత్త వైవిధ్యం ఉంటుందని.. ఈ రోల్ చేయడానికి ధనుష్ ఎంతో ఉత్సాహంగా కనిపించారని చెప్పారు. ఆయన పాత్రలో కొత్తదనం ఉందని, ఈ మూవీలో ధనుష్ రెండు రకాల డిఫరెంట్ హెయిర్‌స్టైల్స్‌లో కనిపిస్తారని వెల్లడించారు. ధనుష్ అద్భుతమైన ప్రతిభావంతుడని, తన అభినయంతో ప్రతి సన్నివేశాన్ని ఎంతో సహజంగా మలచడంలో ఆయన సాటిలేరని ప్రశంసించారు. షూటింగ్ సమయంలో జరిగిన ఒక ఆసక్తికర సంఘటనను డైరెక్టర్ గుర్తుచేసుకున్నారు. రెండు రోజుల పాటు చిత్రీకరించాల్సిన ఒక కీలకమైన సీన్ గురించి తాను ధనుష్‌తో చర్చిస్తుండగా.. ఆయన కూల్‌గా, 'రాజ్‌కుమార్, మరీ ఎక్కువగా టెన్షన్ పడకండి.. నేను బాగా చేస్తాను. ఒకవేళ మీకు సచ్చకపోతే మళ్ళీ షూట్ చేద్దాం. నాకు మొదటి రోజు, రెండో రోజు అనే తేడా ఏమీ లేదు. నేను కెమెరా ముందుకు వస్తే, ఆ సన్నివేశం నిజంగానే జరుగుతోందని భావించి నటిస్తాను' అని చెప్పినట్లు తెలిపారు.

రామ్ చరణ్ 'RC-17'లో నటించడంపై క్లారిటీ ఇచ్చిన రిషికాంత్..





: గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'RC17'. 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత మళ్లీ వీరిద్దరి కాంబో రిపీట్ అవుతుండటంతో ఈ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. అయితే ఈ వేడుకల్లో కోలీవుడ్ యంగ్ హీరో రిషికాంత్ కూడా ప్రత్యక్షమవ్వడంతో సోషల్ మీడియాలో రకరకాల వార్తలు చక్కర్లు కొట్టాయి. ఇటీవల మొదరాత్రి, దొరతి వంటి చిత్రాలతో వరస విజయాలు అందుకున్న రిషికాంత్, రామ్ చరణ్ 'RC17'లో ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారని.. అందుకే ఈ పూజా కార్యక్రమానికి హాజరయ్యారంటూ గత కొద్దిరోజులుగా వార్తలు జోరుగా ప్రచారమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న హీరో రిషికాంత్ ఈ ప్రచారంపై స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. తాను 'RC17' సినిమాలో నటించడం లేదని ఆయన స్పష్టం చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ నిర్మించిన 'మొదరాత్రి' సినిమాలో తాను వర్క్ చేశానని.. ఆ పరిచయంతోనే నిర్మాతలు తనను రామ్ చరణ్ సినిమా పూజా కార్యక్రమానికి ఆహ్వానించారని తెలిపారు. కేవలం వారి ఆహ్వానం మేరకే వేడుకకు వెళ్లానని చెప్పారు. సినిమా విడుదలయ్యాక చూసి తెలుసుకోవడం కంటే, ముందే నిజాన్ని తానే స్వయంగా చెప్పేస్తున్నానని అన్నారు. అనవసరంగా ఎలాంటి పుకార్లు సృష్టించవద్దని మీడియాను, అభిమానులను ఆయన కోరారు. రిషికాంత్ ఇచ్చిన ఈ క్లారిటీతో గత కొన్ని రోజులుగా వస్తున్న పుకార్లకు ముగింపు పడినట్లయింది.

అలా జరగడం కూడా మంచిదే.. ఎన్నో పాఠాలు నేర్చుకున్నా



జీవితంలో అపజయాలే ఎక్కువగా నేర్పిస్తాయన్నారు నటి సమంత. తాజాగా ఓ షోలో పాల్గొన్న ఆమె.. వ్యాపారంలో విఫలమైన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఆ ఓటమి తనకు విజయాల కంటే ఎక్కువ పాఠాలు నేర్పిందన్నారు. "నా తొలి వ్యాపార భాగస్వామ్యం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అయితే, మొదటిసారి పెట్టుబడి పెట్టిన వ్యాపారం విఫలమవడం కూడా మంచిదే. ఎందుకంటే, విజయాల కంటే అపజయాలే ఎక్కువ నేర్పిస్తాయి. నా జీవితంలో నేర్చుకున్న పాఠాలన్నీ వైఫల్యాల నుంచి వచ్చినవే. విజయాలు నాకు పెద్దగా ఏమీ నేర్పించలేదు" అని ఆమె చెప్పుకొచ్చారు. ఇదే షోలో వ్యాపార రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపైనా ఆమె మాట్లాడారు. "కొత్తగా ఏదైనా ప్రారంభించాలంటే మహిళల్లో భయం ఎక్కువగా ఉంటుంది. మహిళా పారిశ్రామికవేత్తలతో కలిసి పనిచేయడం నాకు కొత్త అనుభవం. ఇప్పటివరకు నేను దాదాపు 8 నుంచి 10 వ్యాపార సంస్థల్లో పెట్టుబడి పెట్టాను. వాటిలో ఎనిమిది సంస్థలకు మహిళలే వ్యవస్థాపకులుగా ఉండడం సంతోషకరమైన విషయం" అని తెలిపారు. త్వరలో తొలి బిడ్డకు జన్మనివ్వనున్న సమంత.. ప్రస్తుతం 'సెలబ్రిటీ మాస్టర్‌షెఫ్ తమిళం' షోకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖుల వ్యాపారాలు సాధారణంగా విజయం సాధించినప్పుడు వార్తల్లోకి వస్తాయి. సమంత వెల్లడించిన సమాచారం.. వ్యాపారంలో ఆమె ప్రయాణంలోని కొత్త కోణాన్ని చూపిస్తుంది. అన్నీ విషయాలు ఎల్లప్పుడూ అనుకున్నట్లుగా జరగవు. కొన్నిసార్లు, ఒక విజయవంతమైన వ్యాపారం కంటే ఒక విఫలమైన ప్రారంభం మనకు చాలా కాలం పాటు గుర్తుండిపోయే పాఠాలను నేర్పుతుందని సమంత పేర్కొన్నారు.

సమంత తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ఫోటోను షేర్ చేసింది. ఇందులో ఆమె సోఫాపై హాయిగా కూర్చొని, తన బేబీ బంప్‌ను చేతులతో పట్టుకుని కనిపించింది. రెడ్ కలర్ ప్రింటెడ్ టాప్, వైట్ కలర్ ప్యాంట్ ధరించిన సమంత.. కళ్లకు సన్‌గ్లాసెస్ పెట్టుకుని రిలాక్స్‌డ్ లుక్‌లో కనిపించింది. సాధారణంగా సెలబ్రిటీలు మ్యాటర్నిటీ ఫోటోషూట్ కోసం ప్రత్యేకమైన దుస్తులు, అందమైన లొకేషన్లు, భారీ సెటప్‌లను ఎంచుకుంటారు. కానీ సమంత మాత్రం చాలా సింపుల్‌గా తన ఫోటోను షేర్ చేసింది.

సండియార్ నుంచి కమల్ హాసన్ సరికొత్త లుక్ రిలీజ్..



విలక్షణ నటుడు, ఉలగనాయకుడు కమల్ హాసన్ మరోసారి తన సరికొత్త లుక్‌తో అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సండియార్'. ఇప్పటికే ఈ మూవీ నుంచి కమల్ హాసన్ ఫస్ట్ లుక్ రిలీజ్ కాగా.. ఇందులో పూర్తిగా భిన్నమైన, రఫ్ అండ్ రా అవతార్‌లో కనిపించి అభిమానులను ఆకట్టుకున్నాడు. నెరిసిన గడ్డం, జుట్టు, గంభీరమైన చూపులతో ఆయన లుక్ సినిమాపై అంచనాలను పెంచగా.. ఇప్పుడు ఇదే జోష్‌తో మరో సరికొత్త లుక్‌ను షేర్ చేశాడు కమల్ హాసన్. 'ప్రతి యుగానికి అతీతంగా ఎల్లప్పుడూ కాలం కంటే ముందుగానే' అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ లుక్‌లో కమల్ హాసన్ యంగస్టర్‌గా కనిపిస్తూ ఫ్యాన్స్‌ను మెస్మరైజ్ చేస్తున్నాడు. కాగా.. 'చిత్తా', 'సేతుపతి' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు ఎస్.యు. అరుణ్ కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా బ్యానర్లపై కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్నారు. సినిమా కథ, ఇతర నటీనటులు, విడుదల తేదీ వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

బాలీవుడ్ నటులకు గ్యాంగ్‌స్టర్‌ల ముప్పు

బాలీవుడ్ స్టార్స్‌కు గ్యాంగ్‌స్టర్‌ల ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే బాలీవుడ్ హీరో టైగర్ షార్ఫ్ పై కాల్పులు జరపడంతో పాటు రణ్ బీర్ కపూర్ ఇంటివద్ద రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. గ్యాంగస్టర్‌లు బాలీవుడ్ స్టార్స్ టార్గెట్‌గా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు కీలక సూచనలు జారీ చేశారు. హీరోలు, నటులు జనసమూహాలకు, అభిమానులు పెద్ద సంఖ్యలో గుమిగూడే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. స్టార్స్ ఎక్కడకు వెళ్లినా ఫ్యాన్స్ హంగామా ఉంటుందని, సెల్ఫీల కోసం ఎగబడతారని... అయితే గ్యాంగ్ స్టర్ల నుండి బెదిరింపులు వస్తున్న నేపథ్యంలోనే నటీనటులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో అభిమానులతో సెల్ఫీలు దిగడం, ఎక్కువసేపు గుమిగూడిన ప్రాంతాల్లో ఉండటం లాంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అభిమానులతో సమావేశాలు నిర్వహించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే టైగర్ ష్రాఫ్ పై కాల్పులు జరగ్గా గ్యాంగ్ స్టర్లు సోషల్ మీడియా పోస్టులు, ఇన్ స్టా రీల్స్ ద్వారా నటీనటుల కదలికలను గమనించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వాళ్లు ఎలాంటి వాహనాల్లో ప్రయాణిస్తున్నారు? వారి భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? అనే వివరాలను కూడా సేకరించినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే వారిని అప్రమత్తంగా చేస్తూ సూచనలు జారీ చేశారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com